
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 2 జూలై 2024



సీలేరు జెన్‌కో సీఈగా వాసుదేవరావు బాధ్యతలు



సీలేరు, జూలై 1: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌గా వాసుదేవరావు సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు పరిధిలోని మూడు జలవిద్యుత్ కేంద్రాల ఇంజనీర్లు, జెన్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ఇంజనీర్లతో సమావేశమై కాంప్లెక్సు పరిధిలోని విద్యుదుత్పత్తి, యూనిట్ల పనితీరు, నీటి నిల్వలు తదితర అంశాలపై ఆయన చర్చించారు.



పాడేరులో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ నేతలు



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్, దొన్నుదొర

పండగలా పింఛన్ల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచే పంపిణీ

తొలి రోజు 90.16 శాతం మందికి అందజేత

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని లబ్ధిదారుల సంబరం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండగలా జరిగింది. అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే ఈ వేడుక ప్రారంభమైంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి రూ.7,000 అందజేయడంతో అవ్వా తాతల మోములో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,26,813 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, తొలి రోజు సాయంత్రం ఏడు గంటలకు 1,14,332 మందికి పెన్షన్లను అందించారు.

ఎన్నికల సమయంలో కూటమి తరఫున చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ నగదు పెంచి లబ్ధిదారుల ఇళ్లకే అందజేశారు. దీంతో అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేశారు. తాము నియమించిన గ్రామ వలంటీర్లు లేకుంటే క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు నేరుగా అందవని వైసీపీ నేతలు పదేపదే తప్పుడు ప్రచారం చేశారు. ఒకదశలో ప్రజలు సైతం వాస్తవమే అని నమ్మేలా చేశారు. కానీ నేడు అదంతా వైసీపీ ఆడిన ఒక నాటకం మాత్రమేనని, వలంటీర్లు లేకపోయినప్పటికీ లబ్ధిదారులకు అందాల్సిన పథకాలు అందకుండాపోవని నిరూపించారు. గతానికి భిన్నంగా తొలి రోజు ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు చేరుకుని పెన్షన్ సొమ్మును అందించడం మొదలు పెట్టారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు ... మిగతా 8వ పేజీలో



పాడేరులో దివ్యాంగుడు మణికంఠకు పెన్షన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పంపిణీ

పాడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సైతం సోమవారం పాల్గొన్నారు. పాడేరులోని సంద్రుపుట్టు కాలనీలో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పోతల కొండమ్మ అనే వృద్ధురాలికి రూ.7 వేలు, స్వాముల మణికంఠ అనే దివ్యాంగుడికి రూ.6 వేలు పెన్షన్ సొమ్మును ఆయన అందించారు. అలాగే రేషన్ అందుతుందా?, ఎన్ని కిలోలు బియ్యం ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉందని, పిల్లలు ఎక్కడ ఉంటారని వృద్ధురాలిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళి, ఎంపీడీవో సాయినవీన్, ఈవోఆర్‌డీ రమేశ్, సచివాలయం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో తొలి రోజు పెన్షన్ల పంపిణీ వివరాలు

వ.సం	మండలం	లబ్ధిదారులు	పెన్షన్ పొందిన వారు	పంపిణీ శాతం
1.	కూనవరం	3,999	3,857	96.40
2.	గంగవరం	3,974	3,671	91.62
3,	రంపచోడవరం	4,607	4,495	96.96
4.	వీఆర్.పురం	3,754	3,344	88.68
5.	అరకులోయ	6,589	6.226	94.26
6.	మారేడుమిల్లి	2,023	1,786	87.59
7.	హుకుంపేట	7,271	7,067	96.71
8.	పాడేరు	6,676	5,914	87.85
9.	కొయ్యూరు	7,735	7,073	90.64
10.	ఏటపాక	6,146	5,884	95.36
11.	చింతూరు	5,136	4,678	90.83
12.	ముంచంగిపుట్టు	6,313	5,880	93.57
13.	దేవీపట్నం	4,443	3,730	83.10
14.	అడ్డతీగల	5,477	5,179	92.66
15.	అనంతగిరి	6,130	5,612	90.08
16.	వై.రామవరం	3,371	2,907	82.41
17.	డుంబ్రిగుడ	6,512	5,963	91.20
18.	పెదబయలు	6,213	5,478	86.45
19.	రాజవొమ్మంగి	6,522	5,636	83.90
20.	చింతపల్లి	9,551	8,826	91.00
21.	జి.మాడుగుల	6,596	6,109	90.51
22.	జీకేవీధి	7,775	6429	80.63
మొత్తం		1,26,815	1,14,332	90.16%

మాట నిలబెట్టుకున్న చంద్రన్న



పింఛన్ పెంపుపై ఎన్నికల ముందు ఇచ్చిన మాటను తొలి నెలలోనే నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రన్నకు ఎవరూ సాటిలేరు. వైసీపీ ప్రభుత్వం రూ.వెయ్యి పెంచేందుకు ఏడాదికి రూ.250 చొప్పున పెంచుకుంటూ వచ్చారు. చంద్రబాబు ఒకేసారి రూ.వెయ్యి పెంచారు. బకాయిలతో కలిపి ఒకేసారి రూ.7 వేల పింఛన్ అందుకోవడం చాలా సంతోషంగా ఉన్నది. నాకు పింఛన్ తప్ప మరో ఆధారం లేదు. చంద్రబాబు చేసిన మేలు జీవితంలో మర్చిపోలేను.

-నికిల్ చంప, ఒంటరి మహిళ, చింతపల్లి

చంద్రబాబుకు రుణపడి ఉంటా..



పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న వృద్ధులకు చంద్రబాబు బాసటగా నిలిచారు. ఒకేసారి రూ.వెయ్యి పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. గతంలోనూ రూ.రెండు వేలు పింఛన్ పెంచింది చంద్రబాబే. వృద్ధులు, దివ్యాంగులపై కనికరం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆయనకు రుణపడి ఉంటాను.

-శుభాన్ సాయిబు, చింతపల్లి

6 గంటలకే పింఛన్ అందుకున్నాను



పింఛన్ ఉదయం ఆరు గంటలకే అందుకున్నాను. ఒకేసారి రూ.7వేలు అందుకోవడం చాలా ఆనందంగా ఉన్నది. ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు కూటమి అధికారంలోకి వస్తే ఇంటింటికి పింఛన్ పంపిణీ ఆగిపోతుందని చెప్పారు. నేను నమ్మలేదు.. ఈ నెల సచివాలయం ఉద్యోగులు ఉదయం ఆరు గంటలకే ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చారు.

-కిముదు మహదేవ్, జీకేవీధి

గతంలో డబ్బులు మందులకే సరిపోయేవి



వైసీపీ ప్రభుత్వ హయాంలో వికలాంగులకు ఇచ్చే రూ.3 వేలు పింఛన్ మా అబ్బాయి మందులకే సరిపోయేవి. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు పింఛన్‌ను రెట్టింపు చేయడం చాలా సంతోషంగా ఉంది. 8 ఏళ్ల వయసున్న నా కుమారుడికి సక్రమంగా మాటలు రావు. చురుకుదనం లేకుండా ఉంటున్నాడు. చంద్రబాబు దివ్యాంగుల పట్ల, వారి అవసరాలకు తగ్గట్లుగా పింఛన్ రూపంలో ఆర్థిక సాయం చేశారు.

-ఎరుబంటి కుమారి, దివ్యాంగ బాలుడి తల్లి, యండపల్లివలస, అరకులోయ



విశ్వేశ్వరరాజును ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు

మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మాత్రమే మోదకొండమ్మ ఆలయ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించాలనేది ఆనవాయితీ. దానిని అనుసరిస్తూ ఇప్పటి వరకు ఆలయ కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గిడ్డిఈశ్వరి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆలయ/ఉత్సవ కమిటీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వర్తక సంఘం ప్రముఖుల సమక్షంలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రకటించారు. అన్ని వర్గాలకు చెందిన వారికి భాగస్వామ్యం కల్పిస్తూ నూతన ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, కిల్లు వెంకటరమేశ్‌నాయుడు, సీనియర్ నేతలు పోలుపర్తి గోవిందరావు, రొబ్బి రాము, బూరెడ్డి నాగేశ్వరరావు, బీజేపీ నేతలు కురసా ఉమామహేశ్వరరావు, సల్లా రామకృష్ణ, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దలు, వర్తక సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం హాజరు ఉండాలి

గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

టీచర్ల కొరత లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు -వార్త 8లో

ఇటొస్తే సర్కస్ ఫీట్లే..

- గోతులమయంగా అంతర్ రాష్ట్ర రహదారి
- వర్షాలు కురుస్తుండడంతో చెరువులను తలపిస్తున్న వైనం
- వాహనచోదకులు, ప్రయాణికులకు తప్పని పాట్లు
- వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతో అవస్థలు
- కూటమి ప్రభుత్వం రావడంతో రోడ్డు బాగుపడుతుందని ఆశాభావం

గూడెంకొత్తవీధి, జూలై 1: మూడు రాష్ట్రాలను కలిపే అంతర్ రాష్ట్ర రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. గూడెంకొత్తవీధి నుంచి లంకపాకలు గ్రామం వరకు రహదారిలో అడుగడుగునా భారీ గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారిపైన ఏర్పడిన గోతులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.



అడపరాయిగొంది గ్రామ సమీపంలో ఛిద్రమైన రహదారి



చెరువును తలపిస్తున్న లంకపాకలు బ్రిడ్జి

గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు కనీస చర్యలు చేపట్టకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు-చింతపల్లి ప్రధాన రహదారిలో గూడెంకొత్తవీధి నుంచి లంకపాకలు గ్రామం వరకు ఎనిమిది కిలోమీటర్ల రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ప్రతి రోజూ ఈ రహదారిపై ఒడిశా, భద్రచలం, హైదరాబాద్, సీలేరు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొంత మంది ప్రయాణికులు కార్లు, ద్విచక్రవాహనాల్లోనూ ప్రయాణిస్తుంటారు. ఈ రహదారిపై ఏర్పడిన ఒక్కో గొయ్యి అడుగు, రెండు అడుగుల లోతు కలిగి ఉన్నాయి. దీంతో వాహనాలు అతి కష్టంపై ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. ఒకసారి ఈ మార్గంలో ప్రయాణించిన వాహనం కచ్చితంగా మెకానిక్ షెడ్‌కి తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని వాహన చోదకులు ... మిగతా 8వ పేజీలో




సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్ అధికారులు. (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్. పక్కన అభిషేక్

ఏజెన్సీలో రోడ్ల నిర్మాణ పనులకు అత్యంత ప్రాధాన్యం

కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులపై గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో(రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో వర్చువల్ విధానంలో)కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మంజూరు చేసిన పనులెన్ని, వాటిలో ఎన్ని పనులు పూర్తి చేశారు?, పురోగతిలో ఉన్నవి ఎన్ని? అనే వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలపైనా ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అన్ని ఇంజనీరింగ్ పనులకు సంబంధించి పక్కాగా డేటాను సిద్ధం చేయాలని, డేటా తయారు చేస్తే అవసరమైన పనులకు ముందుగా ప్రతిపాదనలు తయారు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

అలాగే గ్రామాల్లో పనులు ప్రతిపాదించే క్రమంలో అవసరాన్ని గుర్తించి జనాభా ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. రహదారులకు వినియోగిస్తున్న సామగ్రి వివరాలు, నాణ్యతలపై ఆరా తీశారు. ప్రాధాన్యతా క్రమంలో కాంట్రాక్టర్లందరికీ సమానంగా బిల్లులు చెల్లించాలని, ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావు ఉండకూడదన్నారు. పలు రకాల రోడ్ల నిర్మాణానికి వ్యయం చేసే నిధుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బిల్లులు చెల్లించిన తరువాత పనులు చేయకపోతే సంబంధిత కాంట్రాక్టకు భవిష్యత్తులో ... మిగతా 8వ పేజీలో



దోనుగుమ్ములు జలపాత సోయగం

మండలంలోని దోనుగుమ్ములు జలపాతం జలజలపారుతోంది. ఈ ఏడాది తొలకరి వర్షాలు విస్తారంగా కురియడంతో జలపాతం కళకళలాడుతోంది. సుమారు 100 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు పడుతోంది. దీంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు జలపాతంలో సందడి చేసేందుకు క్యూకడుతున్నారు. శని, ఆదివారాల్లో పర్యాటకులు జలపాతం వద్దకు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ జలపాతం గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో దోనుగుమ్ముల గ్రామంలో ఉంది.

-గూడెంకొత్తవీధి

← జలజలపారుతున్న దోనుగుమ్ములు జలపాతం

254 కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితుడితో సీఐ రమేశ్, ఎస్ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లి, జూలై 1: మండలంలోని ఎ. శనివారం కొత్తమాడెంబంద గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఎగుమతికి సిద్ధం చేసిన 254 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రమేశ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓ వ్యక్తి ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి మైదాన ప్రాంతాలకు తరలించేందుకు కొత్తమాడెంబంద గ్రామ శివారు కొండపై డంప్ చేశాడన్నారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణాతో సంబంధం కలిగిన స్థానిక గిరిజనుడిని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.12.5 లక్షలు ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

పింఛనుదారుల్లో ఉప్పొంగిన ఆనందం

పెంచిన పింఛన్లను పంపిణీ చేసిన కూటమి నేతలు, అధికారులు

రూ.ఏడు వేలు తీసుకోవడంతో సంతోషపడిన లబ్ధిదారులు

చంద్రబాబు పెద్ద కొడుకులా ఆదుకున్నాడంటూ దీవించిన పండుటాకులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును సోమవారం ఉదయం ఆరు గంటలకే అందుకున్న అవ్వ,తాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఒకేసారి రూ.ఏడు వేలు అందుకున్న వారంతా నోట్లను లెక్క పెట్టుకొని మురిసిపోయారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను బకాయిలతో కలిపి ఏడు వేల రూపాయలను ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు పంపిణీ చేశారు.

మాటల్లో కాదు చేతల్లో చూపుతున్నారు

జక్కా లక్ష్మీనారాయణ, లక్కవరం, ఎలమంచిలి మండలం



సామాజిక పెన్షన్ల పెంపు గొప్పది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన నగదు ఒకేసారి పంపిణీ చేయడం రికార్డ్ బ్రేక్. జీవితంలో పెన్షన్ రూపంలో ఏడు వేల రూపాయలు ఒకే సారి అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. పాలన అంటే మాటలు కాదు చేతలని చంద్రబాబు నిరూపిస్తున్నారు.

ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం

ఒమ్మి అబద్దం, పెదపల్లి, ఎలమంచిలి



ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ల సొమ్ము పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో ఇంత పెన్షన్ డబ్బులు అందుకోవడం ఇదే మొదటి సారి. ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు మాకు ఇచ్చి వరం ఇది. ఆయనకు ఎల్లప్పుడూ రుణ పడి ఉంటాం.

చంద్రబాబును భగవంతుడు చల్లగా చూడాలి

యండపల్లి కన్నమ్మ, వృద్ధురాలు, యండపల్లివలస, అరకులోయ



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిండా నూరేళ్ళ చల్లగా ఉండాలి. పేదలకు అండగా నిలి వాలి. ప్రజలకు మంచి పరిపాలన అందించాలి. తమలాంటి పండుటాకులకు వెయ్యి రూపాయలు ఒక్కసారే పెంచినందుకు ధన్యవాదాలు.

మా ఇంటికి చంద్రబాబు పెద్ద కొడుకు

చిటికెల సన్యాసిమ్మ, లింగాపురం, కోటవురట్ల మండలం



ఎన్నికల ముందు చెప్పినట్టే చంద్రబాబునాయుడు రూ. నాలుగు వేలు పెన్షన్ అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇన్నాళ్లు చాలీచాలని పెన్షన్ డబ్బులతో ఇబ్బందులు పడ్డాం. నా కుటుంబంలో నాతోపాటు నా కుమార్తెకు వింతు పెన్షన్ ఇస్తూ చంద్రబాబు పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు.

చంద్రబాబు పెద్దకొడుకులా ఆదుకున్నాడు

ముజ్జి దేవయ్య, దబ్బాపుట్టు గ్రామం, పాడేరు మండలం



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా పింఛన్‌ను రూ.వెయ్యి పెంచి నా పెద్ద కొడుకులా ఆదుకున్నాడు. నా లాంటి వృద్ధులను ఆర్థికంగా ఆదుకోవడం ఆనందంగా ఉంది. కొడుకులు, సంరక్షణ లేని వృద్ధులకు ఈ పింఛన్ పెంపుతో భరోసా లభించింది.

పిల్లలను పోషించుకొనే ధైర్యం వచ్చింది

కొండపూజారి ఈశ్వరమ్మ(వితంతువు), మినుములూరు, పాడేరు మండలం



ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ రూ.4 వేలు అందించడంతో పిల్లలను పోషించుకొనే ధైర్యం వచ్చింది. భర్త మరణించిన తరువాత కూలీ, నాలీ చేసి ముగ్గురు పిల్లలను పెంచుకుంటూ వస్తున్నాను. నెలకు రూ.4 వేలు పింఛన్‌ను అందించడంతో మరింత ధైర్యం వచ్చింది.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- ప్రతి అర్జీని పరిశీలించి సత్వర న్యాయం చేయాలి
- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై అందుతున్న దరఖాస్తులను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి అర్జీలను పరిశీలించి ఎటువంటి ఆలస్యం చేయకుండా పరిష్కారం చూపాలన్నారు. లేని పక్షంలో కనీసం అర్జీదారునికి ఎందుకు ఆలస్యం అవుతున్నది అనే అంశంపై సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మొత్తం 136 అర్జీలు అందాయి. వీటిలో 82 ఫిర్యాదులు రెవెన్యూ, భూ సమస్యలపై ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌వో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 22 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మురళీకృష్ణ స్వయంగా వీటిని స్వీకరించి, సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐ సావిత్రి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి టౌన్, జూలై 1 : జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇక్కడి ఉషాప్రైమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే జర్నలిస్టులకు వారి ఆరోగ్యం పట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో ఉచిత వైద్య పరీక్షలను చేయిస్తున్నట్టు చెప్పారు. రోజుకి 50 మంది చొప్పున ఉచిత వైద్య పరీక్షలు ఆస్పత్రిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, ఆస్పత్రి ఎండీ డాక్టర్ అవినాష్, ఆర్డీవో చిన్నికృష్ణ, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రంజిత్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

కుస్తీ పోటీలలో సత్తా చాటిన కొయ్యూరు విద్యార్థులు

కొయ్యూరు, జూలై 1: జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొయ్యూరు కుస్తీ శిక్షణ కేంద్ర విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు కోచ్ అంబటి నూకరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. గత నెల 28, 29 తేదీల్లో తమిళనాడులోని మెట్టూరులో జరిగిన అండర్-23 సౌత్ జోన్ నేషనల్ లెవెల్ కుస్తీ పోటీలలో పాలిక బుజ్జిబాబు 55 కేజీల విభాగం(ఫ్రీ స్టైల్), ముద్దూరు రమణ 55 కేజీల విభాగం (గ్రీకో రోమన్ స్టైల్), గంధం అశోక్ 63 కేజీల విభాగం (గ్రీకో రోమన్ స్టైల్)లో కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలను రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, ఏపీ కోచ్ శివాజీ,స్థానిక ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

జగన్ ప్రభుత్వంలో ఒక్కొక్కరిపై రూ. ఐదు లక్షల అప్పు

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, జూలై 1: జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్కొక్కరిపై రూ. ఐదు లక్షల చొప్పున అప్పు ఉందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం మండలంలోని పెదగుమ్ములూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నెరవేర్చారని, చంద్రబాబు నిత్యం పేద ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆలోచిస్తారన్నారు. నియోజకవర్గంలో సుమారు 47,267 మందికి రూ. 30,84,33,800 అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి మంత్రి అనిత భోజనం చేశారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన మంత్రి అనితను మాజీ ఎంపీపీ వినోద్‌రాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. నాగరత్నం, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, పెద్దిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, టీడీపీ నేతలు వెంకటరాజు, నవీన్‌రాజు, గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెదగుమ్ములూరులో లబ్ధిదారురాలికి పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

చెలరేగిన భరత్...వైజాగ్ వారియర్స్ గెలుపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 1: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా సోమవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఆరు వికెట్ల తేడాతో బెజవాడ టైగర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 143 పరుగులు చేసింది. కేవలం 12 పరుగులకే ఓపెనర్లు అభినవ్ (0), మహదీప్‌కుమార్ (7) అవుటయ్యారు. తర్వాత స్థానాల్లో దిగిన ధ్రువకుమార్‌రెడ్డి (12), కెప్టెన్ రిక్కీబుయ్ (16) కూడా విఫలమవ్వడంతో కేవలం 55 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

అయితే మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన మనీష్ (44; 4 బౌండరీలు, 1 సిక్సర్), పైలా అవినాష్ (23; 2 ఫోర్లు, 1 సిక్సర్), కేపీ సాయి రాహుల్ (30; 1 బౌండరీ, 3 సిక్సర్లు) రాణించడంతో 143 పరుగుల స్కోరును సాధించింది. వైజాగ్ వారియర్స్ బౌలర్లలో కె.సుదర్శన్ (3/30), యద్దాల రెడ్డి (1/18), యశ్వంత్ (1/23) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్ 19.1 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు బండారు సుజన్ (27), అశ్విన్ హెబ్బర్ (35; 3 బౌండరీలు, 2 సిక్సర్లు) శుభారంభాన్నివ్వగా, మిడిల్ ఆర్డర్‌లో దిగిన టీమిండియా క్రికెటర్, వైజాగ్ వారియర్స్ సారథి శ్రీకర్ భరత్ (46 నాటౌట్; 26 బంతుల్లో 3 బౌండరీలు, 3 సిక్సర్లు) చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. చివర్లో మనిష్ వర్మ (11; 2 బౌండరీలు), ముప్పల శివ (20; 3 బౌండరీలు) మెరిపించడంతో ఐదు బంతులు మిగిలి ఉండగానే వైజాగ్ వారియర్స్ విజయం సొంతం చేసుకున్నది. బెజవాడ టైగర్స్ బౌలర్లలో శంభు అఖిల్ (2/17), సాయితేజ (1/27), కేపీ సాయి రాహుల్ (1/26) రాణించారు. గేమ్ ఛేంజర్‌గా కేఎస్ భరత్, సూపర్ స్ట్రైకర్‌గా సాయి రాహుల్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బెజవాడ టైగర్స్ బౌలర్ సుదర్శన్ (3/30) నిలిచారు.



కేఎస్ భరత్

కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదులు నిరసన



కోర్టు సముదాయాల ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూలై 1 : కేంద్ర ప్రభుత్వం ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు జరుపుతున్న మూడు క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ అనకాపల్లి కోర్టు సముదాయాల ఎదుట న్యాయవాదులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకే కాకుండా సామాన్య ప్రజలను కూడా గందరగోళంలో పడేసేలా పౌర న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా చట్టాలు ఉన్నాయని, తక్షణమే వాటిని కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి ఈ నెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం బార్ అసోసియేషన్‌లో జరిగే సమావేశంలో తదుపరి కార్యాచరణ తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బంధం నూక దుర్గారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

- తపాలా ఉద్యోగుల సమావేశంలో ఏఐజీడీఎస్ జాతీయ నాయకుడు బీవీ రావు డిమాండ్

అనకాపల్లి టౌన్, జూలై 1 : అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు గత ప్రభుత్వం వేసిన కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేసి ఆదుకోవాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నాయకుడు బీవీ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఎస్.సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు రూ.ఐదు లక్షలు గ్రాట్యుటీ, రూ.ఐదు లక్షల వరకు కుటుంబ సభ్యులకు కలిపి వైద్య బీమా, మరో రూ.ఐదు లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వేసిన కమిటీ సిఫార్సులను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకుండా తాత్సారం చేయడం తగదన్నారు. డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే గ్రామీణ తపాలా ఉద్యోగులకు వేతన సవరణ జరపాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు వీవీ రామకృష్ణ, పి.భూలోకం, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం, మండల శాఖ అధ్యక్షుడు శ్రీరామదాసు అబ్బులు, తపాలాశాఖ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం సర్వే వద్దు



ఎరియా జలపాతం సమీపంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, జూలై 1: అనంతగిరి మండలం సరియా జలపాతం సమీపాన రిజర్వు ఫారెస్టు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అదానీ కంపెనీ కోల్‌కత్తాకు చెందిన కొంత మందితో చేపడుతున్న సర్వే నిలిపివేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న సోమవారం గిరిజన సంఘం నాయకులతో కలిసి ఈ పవర్ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవరాపల్లి మండలం వాలాబు, చీడికాడ మండలం కోణాం, అనంతగిరి మండలం సరియా గ్రామాల గిరిజనులకు పవర్ ప్రాజెక్టుతో తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న సర్వేను నిలుపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.టిదొర, జర్రా రామరాజు, రాజిబాబు, అప్పరాజు, లక్ష్మణ పాల్గొన్నారు.

క్రైం... crime news

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి



మృతుడు గొర్లి గురయ్య (ఫైల్)

సబ్బవరం, జూలై 1 : మండలంలోని గొల్లలపాలెం శివారు అమరపినివానిపాలెం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. గొల్లలపాలెం గ్రామానికి చెందిన నేబర్తి పైడిరాజుకు ఆ గ్రామ శివారు అమరిపినివానిపాలెంలో మామిడి తోట ఉంది. వెదుళ్లనరవకు చెందిన ఎస్‌కే హలీమ్ లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సదరు మామిడి తోట పనులు చేసేందుకు విజయనగరం జిల్లా ఎస్.కోట బర్మా కాలనీకి చెందిన గొర్లి గురయ్య(45), అతని భార్య లక్ష్మిని రెండేళ్ల క్రితం నియమించాడు. భార్యతో కలిసి గురయ్య మామిడి తోటలనే నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తోట చదును చేసే పనిలో భాగంగా ట్రాక్టర్‌తో మట్టిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొని గురయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

150 కిలోల గంజాయితో ఐదుగురి అరెస్టు



పట్టుబడిన గంజాయి సొత్తు, నిందితులతో సీఐ రమేశ్ సిబ్బంది

పెదబయలు, జూలై 1: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 150 కిలోల గంజాయితో ఐదుగురి నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో సోమవారం సీతగుంట కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరి చొప్పున నలుగురు, కారులో ఉన్న మరొకరిని పట్టుకున్నట్టు చెప్పారు. వీరి విచారించగా ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి రూఢకోట మీదుగా కుజబంగి, సీతగుంట తరలిస్తున్నట్టు చెప్పారన్నారు. పట్టుబడిన వారిలో ముంచంగిపుట్టు మండలం కరిముక్కిపుట్టు పంచాయతీకి బలడ గ్రామానికి చెందిన వి.సురేశ్, పెద్దగూడ గ్రామానికి చెందిన కె.లోకేశ్, అరకు మండలం పద్మాపురం గ్రామానికి చెందిన జి.శివప్రసాద్, ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్,ఖిల్లాగుత్నోగా గుర్తించనట్టు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, కారు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు.

జీపు బోల్తా : పలువురికి గాయాలు

ముంచంగిపుట్టు, జూలై 1: మండలంలోని బంగారుమెట్ట సమీపంలో సోమవారం జీపు బోల్తా పడి పలువురు గాయపడ్డారు. పెదబయలు మండలం కొరవంగి నుంచి సుమారు 15 మంది ప్రయాణికులు జీపులో పెదబయలు వస్తున్నారు. మార్గ మధ్యలో గల బంగారుమెట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో జీపు అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకుపోయింది. దీంతో జీపులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. కొరవంగి గ్రామానికి చెందిన అప్పలమ్మకు నడుము, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు తగిలాయి. హుటాహుటిన ఆమెను పెదబయలు ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సను అందించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి పెదబయలులో వైద్యసేవలు అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ కె.రవీంద్ర తెలిపారు.

అత్యాచారం కేసులో పదేళ్లు జైలు

కొయ్యూరు, జూలై 1: అత్యాచారం కేసులో ముద్దాయికి విశాఖపట్నం ఎస్సీ ఎస్టీ న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష, రూ.తొమ్మిది వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చిందని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2021లో కొయ్యూరు పోలీసు స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైందన్నారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి సర్కారపు గిరీశ్‌కి పదేళ్లు జైలు శిక్ష, రూ.తొమ్మివేల జరిమాన, మరో ముద్దాయి సుర్ల విజయజ్యోతికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.ఆరు వేల జరిమాన విధించినట్టు చెప్పారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు చేసేందుకు కృషి చేసిన పీపీ బి. వెంకట రమణమూర్తికి ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు అభినందించారని సీఐ పీవీ రమణ తెలిపారు.

దొంగకు మూడేళ్ల జైలు

కొయ్యూరు, జూలై 1: దేవాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమాన విధిస్తూ చోడవరం 9వ అడిషనల్ జడ్జి తీర్పు చెప్పారని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొయ్యూరు పోలీసు స్టేషన్ పరిధిలో 2012లో దేవాలయంలో దొంగతనం జరిగిందని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును విచారించిన చింతపల్లి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం 2015లో ముద్దాయి వేములపూడి ఉషాకిరణ్‌కి మూడేళ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పుపై ముద్దాయి హైకోర్టులో అపీల్ చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయి అపీల్‌ను చోడవరం 9వ అదనపు జడ్జి కొట్టివేసి, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును ఖరారు చేసిందన్నారు. ముద్దాయి ఉషాకిరణ్‌ని సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించడం జరిగిందని సీఐ పీవీ రమణ తెలిపారు.

జిల్లా అంతటా తేలికపాటి జల్లులు

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పలు మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. రోజంతా మబ్బులుతో చల్లని వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రం అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల్లో రోజంతా వాతావరణం మేఘావృతమైంది. ఉదయం కొద్ది సేపు తేలికపాటి జల్లులు కురిశాయి. నర్సీపట్నం, గొలుగొండ, రావికమతం, పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో వర్షపు జల్లులు పడ్డాయి.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కశింకోట విద్యార్థులు ఎంపిక



కె.దిలీప్‌భగవాన్



వై.చందురాజు



ఎన్.నవీన్

కశింకోట, జూలై 1 : నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ ప్రవేశానికి కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.దిలీప్ భగవాన్, వై. చందురాజు, ఎన్.నవీన్‌లు ఎంపికయ్యారని వీరు ఈ నెల నాలుగో తేదీన ధ్రువపత్రాల పరిశీలను నూజివీడు వెళ్లనున్నారని వివరించారు. వీరికి ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554


జి.మాడుగుల: కె.కోడాపల్లిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి


కొయ్యూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్, తదితరులు


హుకుంపేట : కోట్నాపల్లిలో పింఛన్ అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు


చింతపల్లి: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వీర సాయిబాబు, టీడీపీ నాయకురాలు జ్ఞానేశ్వరి, తదితర నాయకులు

ఉత్సాహంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పాడేరురూరల్, జూలై 1: కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొనడంతో మండలంలో పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబు పెంచిన రూ.4 వేలు, ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయి రూ. 3 వేలు కలిపి లబ్ధిదారులకు రూ. 7 వేలు అందించడంతో పింఛన్‌దారుల ఆనందానికి అవధుల్లేవు. సోమవారం పాడేరు, సుండ్రుపుట్టు, పాతపాడేరు, కాడెలి, చింతలవీధిలో ప్రారంభించిన పింఛన్ల పంపిణీలో టీడీపీ పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కొట్టగుల్లి సుబ్బారావు, కిల్లో వెంకట రమేష్‌నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ.సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రొబ్బి రాము డీపీ.కుమారి, వరలక్ష్మి, ఉషారాణి, డప్పోడి వెంకటరమణ పాల్గొన్నారు. సలుగు పంచాయతీలో ఎంపీడీవో కె.సాయి నవీన్ పింఛన్లను పంపిణీ చేశారు. వివిధ పంచాయతీల్లో సచివాలయ సిబ్బందితోపాటు కూటమి నాయకులు పెనుమాక రవికుమార్, పాపిటి రాజు, కొట్టగుల్లి రమేష్‌నాయుడు, బాబూరావు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెంచిన పింఛన్ పంపిణీ చేశారు.

సీలేరులో.. జీకేవీధి మండలం సీలేరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లను నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నక్కా తిరుమలరావు, చిటికెల రాము, బాలు, చంద్రరావు, వనముల రాము, తదితర్లు పాల్గొన్నారు.

హుకుంపేటలో.. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా అందజేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. సోమవారం కోట్నాపల్లి సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు రూ.ఏడు వేలు పింఛన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, సాధారణ పింఛన్‌దారులకు ఇకపై ప్రతి నెలా రూ.4 వేలు, వికలాంగులకు రూ.ఆరు వేలు పెన్షన్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, హౌసింగ్ ఏఈ గౌరీశంకర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయలో.. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను బకాయిలతో కలిపి రూ.ఏడు వేలు సోమవారం ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు పంపిణీ చేశారు. అరకులోయ మండలంలో ఉన్న 6,598 మంది పింఛన్‌దారులకు రూ.4,06,71,500 ఉదయం ఐదు గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. సాయంత్రం 5 గంటలకు 92శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో వెంకటేశ్ తెలిపారు.

చంద్రబాబు,పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

మండలంలోని పద్మాపురం, పెదలబుడు పంచాయతీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు మాజీమంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ ఇన్‌చార్జి దొన్నుదొర, కూటమి నేతలు, పింఛన్ లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులకు వారు ఏప్రిల్ నుంచి బకాయిలతో కలిపి ఏడు వేలు చొప్పున్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్, దొన్నుదొర మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినప్పటికీ అన్న మాటకు కట్టుబడి జూలై 1వ తేదీనే పెంచిన పింఛన్‌ను అందజేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో లబ్ధిదారులకు పింఛన్లను ఎంపీడీవో వెంకటేశ్, పెదలబుడు సర్పంచ్ దాసు బాబు, పద్మాపురం మాజీ సర్పంచ్ మహీదేవ్, పద్మాపురం ఎంపీటీసీ సభ్యురాలు కిల్లోముక్త, నాయకులు యాసిన్, సాయిరాం పంపిణీ చేశారు.

డుంబ్రిగుడలో.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కించుమండలో సోమవారం ఉదయం పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. అలాగే కొర్రా పంచాయతీలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. కితలంగి పంచాయతీలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుకుంపేటలో.. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో పింఛన్ల పెంపకం సాధ్యమవుతుందని మాజీమంత్రి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం పెంచిన పింఛన్లను మండలంలోని 33 పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రతీ గ్రామంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తులసీరావు, సీనియర్ నాయకుడు లక్ష్మణుడు, సాగరి సుబ్బారావు, సత్యవతి, సూర్యకాంతం, రమ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరులో.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను అవ్వాతాతలకు అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దేవుడు అయ్యారని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. మండలంలో కూటమి నేతలు పండగ వాతావరణంలో సోమవారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొయ్యూరులో ఎంవీవీ ప్రసాద్, రాజేంద్రపాలెంలో జనసేన నేతలతో కలిసి ఎంపీడీవో సీతయ్య, రావణాపల్లిలో సర్పంచ్ కాకురు లక్ష్మి, బాలారంలో సర్పంచ్ అప్పన అప్పలనర్స పింఛన్లు పంపిణీని ప్రారంభించారు. మండలంలోని 33 పంచాయతీల్లో ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మండలంలో 7,735 మంది లబ్ధిదారులకు రూ.5.37 కోట్లను 190 మంది సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేశారు. తొలిరోజు 6950 మందికి పంపిణీ చేశామని, 90 శాతం పూర్తయ్యిందని ఎంపీడీవో సీతయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలలో స్థానిక సర్పంచులు మాకాడ బాలరాజు, పీటా సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు కూనిశెట్టి మల్లికార్జునరావు, అనిశెట్టి చిరంజీవి, మాకాడ బూర్జులయ్య, మేడిబోయిన చిన్న, గాలి దేముడు, బొంకు రామకృష్ణ పాల్గొన్నారు.

జి.మాడుగులలో.. కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు. మండలంలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఆమె మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్‌ను ఒకేసారి పెన్షన్‌దారులకు విజయవంతంగా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. మిగిలిన హామీలు కూడా అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి చేస్తామని గిడ్డి ఈశ్వరి చెప్పారు.

చింతపల్లిలో.. మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 91శాతం పంపిణీ చేసినట్టు స్థానిక ఎంపీడీవో వి. వీర సాయిబాబు తెలిపారు. సోమవారం సచివాలయం ఉద్యోగులు ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించారు. మండల కేంద్రం రామాలయం వీధిలో టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, కూటమి నాయకులతో కలిసి ఎంపీడీవో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, నాగభూషణం, సేవా ఈశ్వరమ్మ, బేతా నూకరత్నం, సోమేశ్, నాగ భూషణం, రీమల ఝాన్సీ పాల్గొన్నారు. అలాగే చంద్రబాబు పింఛన్ పెంచడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

జీకేవీధిలో.. మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 85 శాతం పంపిణీ చేసినట్టు స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలో వృద్ధులకు ఎంపీడీవో, కూటమి నాయకులు సచివాలయం ఉద్యోగులతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాత్రి ఎనిమిది గంటల సమయానికి 85శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు ముక్కలి రమేశ్, మహేశ్, చిరంజీవి, జడ్పీటీసీ మాజీసభ్యురాలు గంటా నళిని పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో.. రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటి వద్దకు తీసుకువెళ్లి అందించడంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో సోమవారం 90 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని 23 పంచాయతీలలో 6,319 మంది పింఛన్‌దారులల్లో 5,649 మందికి మొదటి రోజు పింఛన్ సొమ్మును అందించడం జరిగిందన్నారు. టీడీపీ నేతలు గ్రామాల్లో పింఛన్లను దగ్గరుండి పంపిణీ చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.బలరాం, వి.లక్ష్మణ్, నాయకులు ఎస్.శంకరరావు, జగత్‌రాయ్, ఎం.చిన్నిబాబు, సూర్యం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో సోమవారం పింఛన్‌దారులు మేనిఫెస్టోకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వి.లక్ష్మణ్, ముకుందపడాల్, చిన్నిబాబు, శ్రావణ్‌కుమార్, తిరుపతిరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడ: కొర్రాలో బాబు మేనిఫెస్టో బ్రోచర్స్‌తో పింఛన్‌దారులు, నేతలు


ముంచంగిపుట్టు: ఏనుగురాయిలో మేనిఫెస్టోకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం


పాడేరురూరల్: గుత్తులపుట్టులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కేవీ.సురేష్‌కుమార్ తదితరులు


పాడేరు రూరల్: డి.గొందూరులో పింఛన్లు పంపిణీలో పాల్గొన్న టీడీపీ మహిళా నాయకులు డీపీ.కుమారి, వరలక్ష్మి తదితరులు

పండగలా పింఛన్ల పంపిణీ

... 5వ పేజీ తరువాయి


పాడేరు మండలం కిండంగిలో పెన్షన్ అందిస్తున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ నేతలు

పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. తెలుగుదేశం పార్టీ నేతలు గిడ్డి ఈశ్వరి, కిడారి శ్రావణ్‌కుమార్, బొర్రా నాగరాజు, బీజేపీ నేతలు పాంగి రాజారావు, కురసా ఉమామహేశ్వరరావు, కూటమి శ్రేణులు ఎక్కడికక్కడ పెన్షన్ పంపిణీ ప్రక్రియలో భాగస్వాములయ్యారు.

తొలి రోజే 90 శాతం పింఛన్ల పంపిణీ

సగానికి పైగా పల్లెలకు రోడ్లు, సమాచార వ్యవస్థ సరిగా లేని జిల్లాలో సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయానికి జిల్లాలో 90.16 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 1,26,813 మంది పెన్షన్ లబ్ధిదారులకు గానూ తొలి రోజు సాయంత్రం ఏడుగంటలకు 1,14,332 మందికి పెన్షన్లను అందించారు. అయితే మారుమూల గిరిజన పల్లెల్లో పెన్షన్ల పంపిణీకి వెళ్లిన సిబ్బంది రాత్రికి గాని తిరిగిరాని పరిస్థితి. వారంతా మండల, డివిజన్ కేంద్రాలకు చేరుకుంటే జిల్లాలో దాదాపుగా 95 శాతం పంపిణీ పూర్తవుతుందని, మిలిగిన వాటిని మంగళవారం పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఏజెన్సీలో రోడ్ల పనులకు అత్యంత ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

పనులు అప్పగించవద్దని ఆయన సూచించారు.జిల్లాలోని గోకులం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏ పీవోలు తమ పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను తనిఖీ చేయాలన్నారు. ప్రైవేటు భూముల్లో రోడ్లు నిర్మించేటప్పుడు గ్రామ సభ తీర్మానం, సంబంధిత భూమి యజమానికి అంగీకారం తప్పనిసరిగా ఎస్టిమేట్స్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధి హామీ పనులు, ఆర్టికల్ 275 పనులు, సీసీడీపీ, ఎస్‌సీఏ పనులు గురించి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. పంచాయతీరాజ్‌శాఖలో చేపడుతున్న భవన నిర్మాణాలు, రహదారుల నిర్మాణాలపై తదితరలను ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ శాఖ ఈఈలు టి.కొండయ్యపడాల్, శ్రీనివాసరావు, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాల సుందరబాబు, ఆయా శాఖల డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఇటొస్తే సర్కస్ ఫీట్లే..

... 5వ పేజీ తరువాయి


కొత్తపల్లి వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

అంటున్నారు. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రయాణం చేస్తుంటే సర్కస్ ఫీట్లు చేసినట్టు ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చిన్నపాటి గోతులను కూడా పూడ్చేందుకు పట్టించుకోకపోవడం వల్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయని, కూటమి ప్రభుత్వం రావడంతో ఈ రహదారికి మహర్దశ పడుతుందని ఈ ప్రాంతవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి

▸▸ జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట

జి.మాడుగుల, జూలై 1 : లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలని పాడేరు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఆదేశించారు. సోమవారం ఆమె జి.మాడుగుల పంచాయతీ బూసుపల్లి ఎండీయూ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట డీటీ.నర్సమ్మ, ఆర్ఐ. కామేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


బూసుపల్లిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట

ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలి

▸▸ టీచర్ల కొరత లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు

▸▸ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కొండలరావు

చింతపల్లి, జూలై 1: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని ఉప సంచాలకులు(డీడీ) కొండలరావు అన్నారు. సోమవారం బాలుర ఆశ్రమ పాఠశాల-1లో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల హెచ్ఎంలతో డీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందించాలన్నారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు కనీస సామర్థ్యాలపై పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆంగ్ల, తెలుగు భాషల్లో విద్యార్థులను ప్రతిభవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ఉపాధ్యాయులు రాత్రి స్టడీలోనూ అందుబాటులో ఉండాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నదన్నారు. పొరుగు పాఠశాలల నుంచి డిప్యూటేషన్ వేస్తామన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆశ్రమాల్లో కచ్చితంగా మెనూ అమలు చేయాలన్నారు. మెనూ పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు విద్య కిట్లు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. ఆగస్టు 15 నుంచి ప్రతి విద్యార్థి యూనిఫారం ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, కొయ్యూరు ఏటీడబ్ల్యూవోలు జయ నాగలక్ష్మి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

దోమల నివారణకు రెండో విడత స్ప్రేయింగ్ : డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, జూలై 1: మండలంలోని గబ్బంగి పంచాయతీ దాలింపుట్టు, గబ్బంగా గ్రామాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా రెండో విడత దోమలమందు పిచికారీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువ్యాపు, బోదవ్యాధి వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే నివాస గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ముంగిట నీటి తొట్టెలు, వాహన టైర్లు, పూలకుండీలు, మనీ ప్లాంట్ తొట్టెలలో నీటి నిల్వలు ఉండడం వల్ల దోమలు గుడ్లుపెట్టి డెంగ్యూ, మలేరియా దోమలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆల్ఫా సైఫర్ మిత్రీన్ 5 శాతం మందును ప్రతీవారు ఇంటా, బయట పిచికారీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శేషయ్య, ఎస్‌యూవో ధనుంజయ్, డీటీ లక్ష్మణమూర్తి, హెచ్ఏ శంకర్, ఆశ వర్కర్లు కాసులమ్మ, పూర్ణ పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై విస్తృత ప్రచారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్టాప్ డయేరియా కార్యక్రమంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా ఆధ్వర్యంలో విస్తృత చేస్తున్నారు. సోమవారం ఆయన, వైద్య సిబ్బందితో కలిసి చింతవీధి సబ్ సెంటర్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారాన్ని చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఆరోగ్య పరీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం నెల రోజులు పాటు నిర్వహిస్తారన్నారు. గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. 45 మంది విద్యార్థినులకు ఆర్‌డీటీ కిట్లు ద్వారా పరీక్షలను నిర్వహించి, మలేరియా లేదని నిర్ధారించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ సాధన, వైద్యాధికారి రాణాప్రతాప్, ప్రిన్సిపాల్ గణేష్, వైద్య సిబ్బంది శెట్టి నాగరాజు, కృష్ణవేణి, సంధ్య పాల్గొన్నారు.


దాలింపుట్టులో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్‌భాషా

పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

గూడెంకొత్తవీధి, జూలై 1: దివంగత బీజేపీ నేత లోకుల గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు లోకుల గాంధీ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొండ్ల చిరంజీవి, పనసల జోగిరాజు, కూకురి శేఖర్, రామ్ కిరణ్, శ్రీనాథ్, టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కొర్ర బలరామ్, సీనియర్ నాయకులు ముక్కల మహేశ్, కల్యాణి పాల్గొన్నారు.

కోతకు గురైన కల్వర్టు మరమ్మతులు చేపట్టాలి

జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి, జూలై 1: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కప్పల గ్రామంలో వర్షాలకు కోతకు గురైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం కోతకు గురైన కల్వర్టును పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు కోతకు గురికావడం వల్ల ద్విచక్రవాహనాలు మినహా ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. దీంతో ఆదివాసీలు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు సంతలకు తీసుకొని వెళ్లి విక్రయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకుడు బెన్నస్వామి పాల్గొన్నారు.

అదుపు తప్పిన బైక్

▸▸ ఒకరికి తీవ్ర గాయాలు

సీలేరు, జూలై 1 : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ చల్లనిశిల్ప గ్రామానికి చెందిన కేలేబు రాజబాబు బైకుపై వస్తుండగా ఆదివారం రాత్రి పిల్లిగెడ్డ గ్రామం వద్ద అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో జెన్‌కో సిబ్బంది అంబులెన్స్‌ను పంపించారు. ఆ అంబులెన్స్‌లో సీలేరు ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందించారు. ఆదివారం రాత్రి చల్లనిశిల్ప గ్రామానికి చెందిన కేలేబు రాజబాబు సొంత పనుల నిమిత్తం ఒడిశాలోని చిత్రకొండ వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. రాజబాబుకు ప్రాణాపాయం తప్పింది.

మినీ గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జి.మాడుగుల, జూలై 1 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మినీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందజేశారు. మండల సందర్శనకు వచ్చిన ఆమెను కలిసి ఎన్నో ఏళ్ల నుంచి తక్కువ వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో తమకు సరైన వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జి.మాడుగుల, జూలై 1: విద్యార్థి దశ నుంచే చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘాల సమఖ్య జిల్లా అధ్యక్షుడు బి.చిట్టిబాబు చెప్పారు. బొయితిలి బాలురు ఆశ్రమ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదేశాల మేరకు వారు విద్యా హక్కులపై 8,9 తరగతుల విద్యార్థులకు క్లబ్బులను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.కార్యక్రమంలో సంఘం నాయకులు కె.రమేశ్, ఒ.బాలరాజు, కె.మాలంనాయుడు, జె.శ్రీను, చిన్నారావు, కేశవరావు, హెచ్ఎం అప్పలకొండ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో మార్పు లేదు..

▸▸ సివిల్ సప్లయ్స్, జీసీసీ అధికారుల స్పష్టీకరణ

అరకులోయ, జూలై 1: జూలై నెలలో రేషన్ కార్డుదారులకు ఇంటింటికి వచ్చి సరుకులు పంపిణీ చేస్తామని సివిల్ సప్లయ్స్ జీసీసీ అధికారులు స్పష్టం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో డీఆర్ డిపోల ద్వారా రేషన్ పంపిణీ జరిగేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రేషన్ పంపిణీలో మార్పులు ఉంటాయని అంతా భావించారు. ఈ నేపథ్యంలో సోమవారం జీసీసీ గోదాములో కలిసిన సివిల్ సప్లయ్స్ డీటీ కె.మత్సరాజు వద్ద ప్రస్తావించగా.. రేషన్ పంపిణీలో మార్పులపై ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. డిపోల నుంచి వాహనాల ద్వారా రేషన్‌ను గ్రామాలలో పంపిణీని వాహనదారులు యథావిధిగా చేస్తారన్నారు. ఇదే అంశంపై డీఆర్ డిపోలను నిర్వహిస్తున్న జీసీసీ మేనేజర్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. తమకు ఎటువంటి సమాచారం లేదని, ఎప్పటిలాగానే ఒకటవ తేదీ నాటికి అన్ని డీఆర్.డిపోలకు రేషన్‌ను చేర్చామన్నారు. డీఆర్ డిపోల నుంచి వాహనదారులు బియ్యం తీసుకొని గ్రామాలలో ఇంటింటా రేషన్ సరఫరా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని కార్డుదారులు గుర్తించి గ్రామాలకు వచ్చే వాహనం వద్ద రేషన్‌ను విడిపించుకోవాలన్నారు.